# 2018 జాతీయ అటవీ విధాన ముసాయిదా లోగుట్టు
# ఆదివాసులకు అన్యాయం, పర్యావరణ విధ్వంసం-కార్పొరేట్లకు లాభాలు

**కేంద్రప్రభుత్వ** అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ మార్చి నెలలో ఒక "జాతీయ అటవీ విధాన ముసాయిదా-2018"ని చర్చకు విడుదల చేసింది. దీనిపై అభిప్రాయాలను ఆన్‌లైన్‌లోనే తెలపాలనీ, అదీ ఏప్రియల్ 14లోపు తెలపాలనే గడువు విధించింది. ఆదివాసులు, అటవీ ఆధారిత ఇతర ప్రజలు ఇంతవరకూ వివిధ రూపాలలో పోరాడి సాధించుకొన్న హక్కులు, సౌకర్యాలను కార్పొరేట్ల ధనదాహానికి బలిచేయడానికి ప్రభుత్వం పూనుకొంది. దీనిపై అభిప్రాయాలను ఆన్‌లైన్‌లోనే తెలియచేయమనడం ద్వారా అసలు అడవి బిడ్డలైన ఆదివాసులను, వారి అభిప్రాయాలను ఒక విధానం రూపొందించడంలో వారి భాగస్వామ్యాన్ని కోరక పోవడమే అప్రజాస్వామికం. అయినప్పటికీ వివిధ ప్రజాతంత్ర సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, పర్యావరణవాదులు తమతమ దృక్కోణాలనుంచి ఈ అటవీ విధాన ముసాయిదాను తిరస్కరిస్తూ అభిప్రాయాలు తెలియచేశారు.

**కొత్త అటవీ విధానం ముసాయిదాలో ఏముంది?**

దీనిలో రెండు తీవ్రమైన విషయాలున్నాయి.

ఒకపక్క భారతదేశంలో అడవులు గొప్ప జీవవైవిధ్యం, సంపదల నిలయమైనవని చెపుతూనే, మరోపక్క భారతదేశ అడవులు లాభసాటిగా లేవని, నిస్సారమౌతున్నాయని చెప్పింది. కనుక ప్రైవేటు భాగస్వామ్యంలో అటవీకరణ విధానాన్ని కొనసాగిం చాలని, అటవీ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, పారిశ్రామిక అవసరాలకోసం వనాల పెంపుదల, పరిశ్రమల సొంత వనాలు (కాప్టివ్ ప్లాంటేషన్) ఏర్పరచడం వంటివి చేపట్టాలని సూచించింది.

నిజానికి ముసాయిదాలో చెప్పిన పై విషయాలు చాలాకాలంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దొడ్డిదారిన అమలుచేస్తూ వున్నవే. వీటికి చట్టబద్ధత కల్పించేందుకే ఇపుడు ప్రభుత్వం బయలుదేరింది. ముసాయిదాలో ముఖ్యమైన విషయం ఇంకొకటి వుంది. అది "భాగస్వామ్య యాజమాన్యం" అంటూ పేరా 4.11లో చెప్పిన "ఇతర చట్టాలు, విధానాలతో సామరస్యతవంటి మాటల చాటున ఇంతకాలం ఆదివాసి ఉద్యమాలు, ప్రజాతంత్ర ఉద్యమ సంస్థలు పోరాటాల క్రమంలో వచ్చిన "అటవీ హక్కుల నిర్ధారణ చట్టం(2006), గ్రామ పంచాయితీల చట్టం(పీసా), వంటి వాటిని నీరుగార్చి, ఎత్తివేసే కుతంత్రం ముందుకు వచ్చింది. అంటే అడవులపై ఆదివాసీల చట్టబద్ధ హక్కులను తొలగించుతారు. అడవులను బడాకంపెనీలకు అప్పగిస్తారు. దీనికి అడ్డుగా వుంటే అన్ని చట్టాలను సవరించడమో, రద్దుచేయటమో చేస్తారు.

పౌరసంఘాలు, ఆదివాసీ మిత్రులు, పర్యావరణవాదులు నూతన ముసాయిదాలోని పై అంశాలను వెల్లడిచేసి గత చట్టాలను కార్యనిర్వాహక ఆదేశాలతో నీరుగార్చే ధోరణులను ఖండించారు. అయితే ఇంకొంత లోతుగా విషయాలను పరిశీలించాలి.

**ప్రభుత్వాల అటవీ విధానాల సారాంశం -తీరుతెన్నులు**

బ్రిటీష్ సామ్రాజ్యవాదం ప్రవేశించే నాటికి అడవి ఆదివాసులదే. వాణిజ్యంకోసం, వనరులపై ఆధిపత్యంకోసం అడవి ఎపుడైతే కావాల్సివచ్చిందో అపుడు అడవిపై అధికారంకోసం యుద్ధం మొదలైంది. గత 300 సం॥ల చరిత్ర అంతా ఎవరిదీ అడవి అన్నదానిపైనే జరిగింది. ఆదివాసుల రక్తం చిందని నేలంటూ ఈ దేశంలో లేదు. ఆదివాసుల తీవ్ర ప్రతిఘటన-అణచివేతల క్రమంలో ప్రభుత్వాల అటవీ విధానాలు రూపొందుతూ వచ్చాయి. తమ దోపిడీ అవసరాలకోసం కొంత అడవి వుంచుకొని కొంత అడవి ఆదివాసులకి వదలిన 1878 అడవుల చట్టం వుంది. అక్కడినుండి 1950ల నాటికి ఆదివాసులకు అడవులపై హక్కులు, సౌకర్యాలు అంటూ హక్కులను సౌకర్యాల స్థాయికి తగ్గించిన అటవీ విధానం వచ్చింది. 1970ల నాటి ఆదివాసీ ఉద్యమాల అణచివేత తర్వాత దోపిడీ అవసరాలకోసం వచ్చిన 1980 అటవీ చట్టం; 1988 అటవీ విధానానికి వచ్చేసరికి అడవులపై ఆదివాసుల సౌకర్యాలు కూడా పోయి ఆదివాసులు ఆక్రమణదారులు, నేరస్తులు అయి పోయారు. రాష్ట్రాలు, వాటి సరిహద్దులు అనేవే లేనికాలంలోనే బస్తర్, రేకపల్లి, రంప రాజ్యాల మధ్య కోయ భూమి వుంది. కోయలను గుత్తికోయలు, గొమ్మికోయలని ఆనాటి మద్రాసు పరగణా ప్రభుత్వం నియమించిన కమిటీ చెప్పింది. కానీ మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దులు నిర్ణయం అయ్యాక గొత్తికోయలు ఆక్రమణదారులైపోయారు. నేటికీ గొత్తికోయల గ్రామాలను తగులబెట్టటం, ప్రజలను హింసించటం రెండు తెలుగు రాష్ట్రాల అధికారులకూ ఒక "హక్కు"గా మారిపోయింది.

1988 జాతీయ అటవీ విధానం తర్వాత ప్రాజెక్టులు, గనుల పేరిట ఆదివాసుల జీవిత విధ్వంసం కొనసాగుతున్న క్రమంలో దేశవ్యాపితంగా ఆందోళనలు చెలరేగాయి. వీటన్నిటినీ 'వామపక్ష తీవ్రవాదం' అన్న అంశం నుంచి చూపిస్తూ అణచివేత - సంస్కరణలు అనే విధానాన్ని కొనసాగిస్తామని అప్పటి కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటించాయి. మన్మోహన్‌సింగ్ యుపిఏ ప్రభుత్వం దోపిడీ సంస్కరణకు "మానవ ముఖం" తగిలించాలని చెప్పింది. "సమ్మిళిత అభివృద్ధి" సమ్మిళిత రాజకీయాల విధానం తెచ్చింది. అంటే దోపిడీ విధానాల బయటవున్న ఆదివాసీ, అటవీ ఆధారిత సమూహాలను తమ "ప్రధాన స్రవంతి" లోకి మళ్ళించాలని పూనుకొంది. దీనికోసం 2006 అటవీ హక్కుల చట్టం చేసింది. "ఆదివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని"

సరిచేస్తున్నట్లు చెప్పింది. రిజర్వు అడవిలో ఆదివాసులు సాగు చేస్తున్న భూములపై వ్యక్తిగత హక్కుల నిర్ధారణ, అడవిపై ఆదివాసీ సమాజాల సామూహిక హక్కుల గుర్తింపు జరుపుతామని చట్టంలో పేర్కొంది.

2006 అటవీ హక్కుల చట్టం వచ్చి 10 సం။లు దాటిపోయింది. ఇప్పటికి కేవలం 3శాతం మాత్రమే సామూహిక హక్కుల నిర్ధారణ జరిగినట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నది.

అటవీ హక్కుల చట్టం అమలులోకి రానేలేదు. ప్రభుత్వం ఆదివాసులకు, పెద్దపులులకు పోటీ పెట్టింది. పెద్దపులల సంఖ్య అంతరించిపోతున్నదని అంటూ వన్యప్రాణి సంరక్షణ చట్టాలు చేసింది. వన్యప్రాణుల జాతీయ పార్కులు, వనాలను, పార్కులను ప్రకటించి వాటిలో అంతకు ముందు జీవిస్తున్న గిరిజనులను బలవంతంగా తరలించింది. పాత ఆదిలాబాద్ జిల్లాలోని ఖవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంకోసం అక్కడి గిరిజనులను తరలించారు. పాపికొండల నేషనల్ పార్కు పేరుతో 1,01,286 హెక్టార్ల అటవీ ప్రాంతంను ప్రకటించి, అందులోని వందలాది గిరిజనులను వారి గూడేలతో సహా తరలించాలని ప్రభుత్వం చూస్తున్నది.

అటవీ హక్కుల చట్టం ఇంకా అమలులోకి రానేలేదు. అటవీకరణ పరిహార చట్టం 2016ను వేగంగా చేసింది. ఖాళీగా వున్న అటవీ భూములలో తిరిగి అడవి పేర ప్లాంటేషన్ పెంచే అటవీకరణ కార్యక్రమం ఇది. అసలు అడవి అంటే ఏమిటనే నిర్వచనాన్ని ప్రభుత్వాలు ఇవ్వడంలేదు. చిన్న నాచు నుంచి మహావృక్షాల వరకూ, వాటిపై అల్లుకొన్న లతలు, కింద పొదలతో క్రిమికీటకాలనుంచి పెద్ద పెద్ద జంతువుల వరకూ ఒకదానిపై ఒకటి ఆధారపడి జీవించే జీవావరణమే అడవి. అలాంటి అడవిని నరికించి ఒకే రకపు మొక్కల ప్లాంటేషన్లు వేసి అవి కూడా చెట్లే కనుక అడవి అనే వైఖరి ప్రభుత్వానిది. ఈ అటవీకరణ పరిహారచట్టం కింద ఏర్పడిన నిధి కేంద్రంలో, రాష్ట్రాలవద్ద 90 వేలకోట్ల రూపాయలుంది. ఈ నిధిలో వాటాకోసం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంపర్లాడుతున్నాయి. తెలంగాణా ప్రభుత్వం ఖాళీ అటవీ భూముల పేరుతో గిరిజనులు 'పోడు' చేస్తున్న వందలాది ఎకరాలను అటవీ హక్కుల చట్టం కింద నిర్ధారించకుండా "హరిత హారం" పేరుతో స్వాధీనం చేసుకొంటున్నది. మొత్తం 230 కోట్ల మొక్కలు నాటాలని, ఏజెన్సీలలో అడవుల బయట 120 కోట్ల మొక్కలు, అడవిలో 100 కోట్ల మొక్కలు నాటాలని చెపుతున్నది. దీనికోసం పాత వరంగల్, ఖమ్మం జిల్లాలలోని వందలాది మంది గిరిజనులను, అడవిపై ఆధారపడి జీవించే ప్రజల్ని గెంటివేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాఫీ, రబ్బరు, తదితర పంటలను రుద్దుతున్నది. గిరిజనుల ఆహారభద్రతలో కొండపోడులు, సాంప్రదాయక పంటలు ముఖ్యమైనవి. వీటినుంచి గిరిజనులను దూరం చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పత్తిపంట వ్యాపించాక ఆదివాసుల రక్త నమూనాలలో ముఖ్యంగా మహిళల రక్తనమూనాలలో ఎర్రరక్త కణాల సంఖ్య 6 శాతంగా వుందంటే ఆహారభద్రత ఎంత తీవ్రంగా దెబ్బతిందో గమనించవచ్చు.

అటవీ హక్కుల చట్టం ఇంకా, ఇంకా అమలే కాలేదు. ఫారెస్టు యంత్రాంగం ఒకపుడు ఆదివాసు లతో కలిసి వేల ఎకరాల అటవీ భూములలో ఉమ్మడి అటవీ యాజమాన్య పద్ధతిని అమలు చేశారు. ఆదివాసుల ప్రమేయం లేకుండానే అటవీ ఉత్పత్తులను, కలపేతర అటవీ ఉత్పత్తులను తరలించుకొనిపోయారు. ఇపుడు ఆ అటవీ భూములు ఉమ్మడి యాజమాన్యంలో వున్నాయి గనుక ఆదివాసులకు హక్కు పత్రాలు ఇవ్వరాదని రెండు తెలుగు రాష్ట్రాలలో ఫారెస్టు యంత్రాంగం అడ్డుకొంటూ వుంది.

నిజంగా అటవీ హక్కుల చట్టం అమలు జరగనే లేదు. కానీ ఈ కాలం అంతా అడవిని బహుళజాతి కంపెనీలకు, గనుల తవ్వకానికి, ప్రాజెక్టుల నిర్మాణానికి మాత్రం అటవీ భూమి వేల ఎకరాలలో చట్టం అమలునుంచి మినహాయించ బడింది. ఢిల్లీలో ఒక సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం 2014 నుంచి ఇప్పటివరకూ ప్రతిరోజూ సగటున 135 హెక్టార్ల సహజ అరణ్యం ప్రభుత్వ, ప్రవేటు వాణిజ్య అవసరాలకోసం మళ్ళించబడుతున్నది.

ఈ విధంగా ఒక ప్రభుత్వం నాటి ప్రజా ఉద్యమాల స్థాయి, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో "మానవముఖం" "సమ్మిళిత అభివృద్ధి" అంటూ కొన్ని చట్టాలను చేసింది. కనీసం వాటి అమలుకి చిత్తశుద్ధితో పూనుకోదు. అలా పూనుకొనే యంత్రాంగాన్ని, దానికి తగిన సాంస్కృతిక వాతావరణాన్ని కల్పించి అభివృద్ధిచేయలేదు. దొడ్డిదారిన ఆ చట్ట వ్యతిరేక అంశాలన్నీ బలపడేలా చర్యలు తీసుకొంటుంది. తర్వాత వచ్చిన ప్రభుత్వం గత ప్రభుత్వంమీద నిప్పులు చెరిగినట్లు నటిస్తుంది. గత ప్రభుత్వ తొందరపాటులను, అవకతవకలను సరిచేసి మరింత అభివృద్ధిచేసే పేరిట అసలు చట్టానికే ఎసరు పెడుతోంది. రెండు ప్రభుత్వాలు మాత్రం సామ్రాజ్యవాదుల, పాలకవర్గాల లాభాలు, అవసరాలకోసం అవకాశాలను బట్టి వ్యవహ రిస్తాయి. ఇవి ఒకే నాణానికి బొమ్మ, బొరుసులు.

ప్రస్తుత యన్‌డిఏ ప్రభుత్వం పర్యావరణ ప్రాధాన్యతరీత్యా అటు అటవీ హక్కుల చట్టాన్ని ఎత్తివేసి కార్పొరేట్ల, సామ్రాజ్యవాద పేపరు మిల్లులు యధేచ్ఛగా అడవిని దోచుకొనేందుకు అటవీ హక్కుల చట్టాన్ని, పర్యావరణ చట్టాలను సవరించడం పేర ఎత్తివేయబోతున్నది. మరోపక్క విశాల తీర ప్రాంతంలోని కోస్టల్ రెగ్యులేటరీ చట్టాలను సవరించి పర్యావరణ నియమ నిబంధనలు సడలించి తీర ప్రాంతాన్ని బహుళజాతి కంపెనీల యధేచ్ఛ దోపిడీకి అప్పగించబోతున్నది. 'సాగరమాల' పేరుతో వేల కోట్లు దీనికి కేటాయించింది.

కనుక భూమికోసం భూస్వాములకు వ్యతిరేకంగా; అడవికోసం, జీవించే హక్కులకోసం కార్పొరేట్లకు, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆదివాసీ సమాజాలు చేసే పోరాటం, పర్యావరణ పరిరక్షణ కోసం చేసే పోరాటం కూడా. వర్గ, ప్రజాతంత్ర ఉద్యమాలే అటు జీవించే హక్కును, ఇటు పర్యావరణాన్ని కాపాడుతాయి. వీటికోసం కృషి చేస్తూనే హక్కులపై ప్రభుత్వాలు చేస్తున్న ఈ చట్టపరమైన ఎదురుదాడిని ఆదివాసీ, ప్రజాతంత్ర ఉద్యమాలు తిప్పికొట్టాలి.

oooo